క్లుప్తంగా

నేడు విద్యుత్‌ సరఫరాకు అంతరాయం

తిరువూరు: విద్యుత్‌ లైన్లకు మరమ్మతులు చేపడుతున్నందున శనివారం ఉదయం తిరువూరు పట్టణంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్‌ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్‌ అర్బన్‌ ఏఈ షఫీ తెలిపారు. పాత తిరువూరు కొత్తూరు, మధిరరోడ్డు, బోస్‌ బొమ్మ ఏరియా, పాత తిరువూరులలో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్‌ సరఫరాను నిలిపివేస్తామని చెప్పారు.

ఓట్ల లెక్కింపులో నిబంధనలు పాటించాలి

తిరువూరు నియోజకవర్గ ఆర్‌ఓ మాధవి



తిరువూరు: జూన్‌ 4న జరుగనున్న అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియలో పోటీ చేసిన అభ్యర్థులు, వారి ఏజెంట్లు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని తిరువూరు నియోజకవర్గ రిటర్నింగ్‌ అధికారి మాధవి అన్నారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో శుక్రవారం అభ్యర్థులకు, ఏజెంట్లకు నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఓట్ల లెక్కింపు కేంద్రానికి నిర్ణీత సమయానికి ముందుగానే చేరుకోవాలని, గుర్తింపు కార్డులు కలిగిన వారికి మాత్రమే ప్రవేశం ఉంటుందని తెలిపారు. సెల్‌ఫోన్లు, కెమెరాలు ఓట్ల లెక్కింపు కేంద్రంలోకి తీసుకురావడం నిషిద్ధమన్నారు. నిబంధనలు ఉల్లంఘించి శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సహాయ రిటర్నింగ్‌ అధికారులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

వాట్సాప్‌ కథనంపై విచారణకు ఆదేశం

ఇబ్రహీంపట్నం: సోషల్‌ మీడియా (వాట్సాప్‌)లో వచ్చిన కథనంపై జిల్లా నీటి యాజమాన్య సంస్థ అధికారులు స్పందించారు. మండలంలోని జూపూడి గ్రామంలో ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న కూలీలు పథకంలో జరుగుతున్న అవినీతిపై ప్రశ్నిస్తే అధికారులు దుర్భాషలాడుతున్నారని ఓ వ్యక్తి వాట్సాప్‌లో శుక్రవారం పోస్ట్‌ చేశాడు. ఈ కథనానికి స్పందించిన గొల్లపూడిలోని డ్వామా అధికారి విచారణకు ఆదేశించారు. విచారణ అధికారులుగా అంబుడ్స్‌మెన్‌ సీహెచ్‌ ఇమ్మానియేలు రాజు, విజయవాడ క్లస్టర్‌ ఏపీడీ వి.వెంకటేశ్వరరావును నియమించారు. రెండు రోజుల్లో సమగ్ర విచారణ జరిపి డ్వామా కార్యాలయానికి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు.

విద్యార్థులకు నగదు బహుమతుల ప్రదానం



పుట్రేల(విస్సన్నపేట): విద్యార్థులు పోటీతత్వంతో చదివి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని ఏఎంసీ మాజీ చైర్మన్‌ మద్దిరెడ్డి సూర్యనారాయణరెడ్డి అన్నారు. మండలంలోని పుట్రేల గ్రామంలో పదో తరగతి పబ్లిక్‌ పరీక్షల్లో 500 మార్కులకు పైగా సాధించిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతిగా సూర్యనారాయణరెడ్డి ఒక్కొక్కరికి రూ. 5 వేల చొప్పున 13 మంది విద్యార్థులకు శుక్రవారం నగదు బహుమతి అందజేశారు. గ్రామానికి చెందిన రేసోదు రుక్మిణి క్యాన్సర్‌ వ్యాధితో బాధపడుతుండటంతో వైద్య ఖర్చుల నిమిత్తం రూ. 15 వేలు ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

దోమల నివారణకు ఫాగింగ్‌

చాట్రాయి: మండలంలోని చిన్నంపేట గ్రామంలో ఇటీవల ప్రజలు జ్వరాల బారిన పడటంతో గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో పారిశుద్ధ్య పనులు ముమ్మరంగా నిర్వహిస్తున్నారు. శుక్రవారం గ్రామంలోని అన్ని కాలనీల్లో దోమల నివారణకు ఫాగింగ్‌ నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్‌ పరసా ధనలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి నిస్సాక్‌ ఆలీ, వైఎస్సార్‌ సీపీ నాయకుడు పరసా చెన్నారావు తదితరులు పాల్గొన్నారు.

ఈదురుగాలులతో రాలిన మామిడి



తిరువూరు: తిరువూరు నియోజకవర్గంలో గురువారం రాత్రి ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. ఈదురు గాలులకు మామిడి కాయలు నేలరాలాయి. తిరువూరు మండలం అక్కపాలెంలో కోళ్లఫారం పైకప్పు లేచిపోయి షెడ్లు పూర్తిగా ధ్వంసమయ్యాయి. గ్రామీణ రహదారులపై చెట్లు విరిగి పడటంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. విద్యుత్‌ లైన్లపై చెట్ల కొమ్మలు పడటంతో శుక్రవారం మధ్యాహ్నం వరకు పలు ప్రాంతాల్లో విద్యుత్‌ సరఫరాకు అంతరాయం కలిగింది.

పెరుగుతున్న ఉద్యాన పంటల సాగు

- ఆయిల్‌పామ్‌ సాగుకు ప్రోత్సాహకాలు
- పెరిగిన కాయగూరలు, పండ్ల తోటల సాగు విస్తీర్ణం
- ప్రత్యామ్నాయ పంటలతో జీవనోపాధి



తిరువూరులో నిమ్మకాయలను గ్రేడింగ్‌ చేస్తున్న మహిళలు

తిరువూరు: తిరువూరు నియోజకవర్గంలో రైతులు ప్రత్యామ్నాయ పంటల సాగుపై ఆసక్తి చూపుతున్నారు. కాపు కాయని మామిడి తోటలను నరికివేసి వాటి స్థానంలో ఆయిల్‌పామ్‌ సాగు చేస్తున్నారు. గతంలో లక్ష ఎకరాల్లో మామిడి తోటలుండగా, ప్రస్తుతం 40 వేల ఎకరాలకు పరిమితమైంది. రెండు వేల ఎకరాల్లో ఆయిల్‌పామ్‌ సాగవుతోంది. కాయగూరల సాగులో ఉద్యానశాఖ ఇస్తున్న రాయితీలతో రైతులు వాటి సాగుకు ఉపక్రమించారు. నియోజకవర్గంలో 400 ఎకరాల్లో కాయగూరల సాగు జరుగుతోంది. గత మూడేళ్లుగా తిరువూరు మండలంలోని రోలుపడి, చిక్కుళ్లగూడెం, చౌటపల్లి, గానుగపాడు, గంపలగూడెం మండలం కనుమూరు, విస్సన్నపేట మండలంలోని కలగర, రామచంద్రాపురం, పుట్రేల, తాతకుంట్ల, గొరంపాలెం, ఎ.కొండూరు మండలం మారేపల్లి, కోడూరు, రామచంద్రాపురం, రేపూడి గ్రామాల్లో కాయగూరలు, గుమ్మడి, మొక్కజొన్న, ఆయిల్‌పామ్‌, బంతి, చేమంతి పూలు సాగు చేస్తున్నారు.

రైతులకు ప్రోత్సాహకాలు

ఉద్యాన పంటలు సాగు చేసే రైతులకు ఉద్యాన శాఖ పలు ప్రోత్సాహకాలను అందిస్తోంది. ఆయిల్‌పామ్‌ సాగు చేసే రైతులకు మొక్కలను సబ్సిడీపై అందించడంతో పాటు నాలుగేళ్ల సాగు ఖర్చులను కూడా ఇస్తున్నారు. ఉపాధి హామీ పథకంలో కూడా ఈ పంట సాగు చేసే రైతులకు తగు ప్రోత్సాహకాలను అందిస్తున్నారు. తీగ జాతి కాయగూరలు, టమాటా పండించే రైతులకు సిమెంట్‌ స్తంభాలతో పందిరి ఏర్పాటు చేసుకునేందుకు రూ.లక్ష సబ్సిడీ మంజూరు చేస్తున్నారు. కాయగూరల తోటల్లో కలుపు రాకుండా ఏర్పాటు చేసే షీట్లకు కూడా రాయితీ లభిస్తోంది. నీటి సదుపాయం ఉన్న పొలాల్లో ఉద్యాన పంటల సాగుకు సూక్ష్మ సేద్యం, బిందు సేద్యం పరికరాలను ఐదు ఎకరాల లోపు విస్తీర్ణానికి 90 శాతం, ఐదు ఎకరాల పైన ఉన్న పొలాలకు 70 శాతం సబ్సిడీ ఇస్తున్నారు. పామాయిల్‌ దిగుబడులను అంపాపురంలోని పతంజలి ఫ్యాక్టరీకి తరలించే విధంగా ఉద్యానవన శాఖ ఏర్పాట్లు చేసింది. మార్కెటింగ్‌ సదుపాయం స్థానికంగానే ఉండటంతో నిమ్మతోటలు కూడా 300 ఎకరాల్లో సాగు చేస్తున్నారు. ప్రత్యామ్నాయ పంటల సాగుతో పలు రైతు కుటుంబాలకు జీవనోపాధి లభిస్తోంది.



ఎ. కొండూరు మండలం మారేపల్లిలో సాగుచేస్తున్న గోంగూర



మారేపల్లిలో ఆకుకూరల సాగు

కాయగూరలు సాగు చేస్తున్నాం



బెండ, బీర తదితర కాయగూరల సాగు లాభదాయకంగా ఉంది. తక్కువ ఖర్చుతో వీటిని సాగుచేయగలుగుతున్నాం. సీజనల్‌ పంటలు వేస్తే తక్కువ సమయంలోనే దిగుబడి సాధించవచ్చు. ఉద్యాన శాఖ కూడా పంటల సాగుకు అవసరమైన ప్రోత్సాహాన్ని అందిస్తోంది.

– శ్రీనివాసరెడ్డి

పంటల సాగుకు ప్రోత్సాహం



రైతులు కాయగూరలు, పండ్ల తోటల పెంపకానికి ముందుకు వస్తే పలు రాయితీలు కల్పిస్తాం. ఆయిల్‌పామ్‌ సాగుకు సబ్సిడీలు ఇవ్వడంతో పాటు ఉపాధి హామీ పథకం ద్వారా కూడా ప్రోత్సాహాన్నందిస్తున్నాం. పండ్లు, కాయగూరల తోటలకు బిందు సేద్యం, సూక్ష్మ సేద్య పరికరాలను సబ్సిడీపై అందిస్తాం.

– సోహెల్‌ అహ్మద్‌, ఉద్యానవన అధికారి, తిరువూరు

వైఎస్సార్‌ సీపీకే మళ్లీ అవకాశం

మాజీ ఎమ్మెల్యే జ్యేష్ఠ రమేష్‌బాబు



మైలవరం: 2024 ఎన్నికల్లో రాష్ట్రంలో వైఎస్సార్‌ సీపీ ప్రభుత్వం ఏర్పాటుకానుందని, ముఖ్యమంత్రిగా మళ్లీ జగనన్నే ప్రమాణ స్వీకారం చేయనున్నారని మాజీ ఎమ్మెల్యే జ్యేష్ఠ రమేష్‌బాబు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వైఎస్సార్‌ సీపీ అత్యధిక మెజారిటీతో అధికారాన్ని చేపట్టనుందని చెప్పారు. గడచిన ఐదేళ్లలో ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో ప్రవేశ పెట్టి అమలు చేసిన పలు అభివృద్ధి, సంక్షేమ పథకాలు లక్షలాది మంది బడుగు, బలహీన వర్గాలకు ఉపయోగపడ్డాయని, ఆ పథకాలు పొందిన లబ్ధిదారులు వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డికి ఏకపక్షంగా పట్టం కడతారన్నారు. వైట్‌ కాలర్స్‌ కొంతమంది కూటమికి ఓట్లు వేసిన వైనంపై బలహీనవర్గాలంతా ఏకమయ్యారన్నారు. ఎన్డీఏ కూటమిలో మూడు పార్టీలు, ఇండియా కూటమిలో నాలుగు పార్టీలు అన్నీ వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డిని ఓడించేందుకు సర్వశక్తులు ఒడ్డినా, కురుక్షేత్రంలో అర్జునుడు మాదిరి వారి ఎత్తులను చిత్తు చేస్తూ తనదైన రాజకీయ చతురతతో పేద, బడుగు, బలహీనవర్గాల మద్దతుతో మళ్లీ అధికారాన్ని చేపట్టనున్నారని చెప్పారు. మైలవరంలో నిరుపేద, సామాన్యుడు అయిన ఎమ్మెల్యే అభ్యర్థి సర్నాల తిరుపతిరావు జగనన్న ఆశీస్సులతో గెలుపొందుతారన్నారు.

వైభవంగా రామలింగేశ్వర స్వామి కల్యాణం



గుడిపాడులో కోలాట భజన చేస్తున్న మహిళలు



రామలింగేశ్వరస్వామికి పూజలు చేస్తున్న భక్తులు

గుళ్లపూడి(ముసునూరు): భక్తుల శివనామ స్మరణ, పురోహితుల వేద మంత్రోచ్ఛరణ, మంగళ వాయిద్యాల నడుమ గుళ్లపూడి శివారు గుడిపాడు పుణ్యక్షేత్రంలోని గంగా, పార్వతీ సమేత రామలింగేశ్వరుని కల్యాణాన్ని గురువారం రాత్రి వైభవంగా నిర్వహించారు. గంగా, పార్వతీ సమేత స్వామి వారిని, పెండ్లి కుమారుడిగా ముస్తాబు చేశారు. గ్రామంలోని ఇరవై మంది దంపతులు పీటలపై కూర్చుని కల్యాణ క్రతువులో పాల్గొన్నారు. ఆలయ అర్చకులు పూరకరణం కామేశ్వరరావు బృందం స్వామివారి కల్యాణ క్రతువును కనుల పండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక మహిళలు ప్రదర్శించిన కోలాట భజన ఆకట్టుకుంది. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నసమారాధన జరిగింది. కల్యాణం అనంతరం గుళ్లపూడి, గుడిపాడు, వలసపల్లి గ్రామ వీధుల్లో శుక్రవారం గ్రామోత్సవం వైభవంగా నిర్వహించారు.

సంయమనంతో వ్యవహరించండి



సమావేశంలో మాట్లాడుతున్న ఏసీపీ రత్నరాజు, పక్కన సీఐ మురళీకృష్ణ

కృష్ణలంక(విజయవాడతూర్పు): సాధారణ ఎన్నికల ప్రక్రియలో భాగంగా జూన్‌ 4వ తేదీన ఓట్ల లెక్కింపు జరగనున్న నేపథ్యంలో రాజకీయ నాయకులు సంయమనంతో వ్యవహరించాలని సౌత్‌ డివిజన్‌ ఏసీపీ రత్నరాజు సూచించారు. కృష్ణలంక పోలీస్‌ స్టేషన్‌లో సీఐ ఎ.మురళీకృష్ణ ఆధ్వర్యంలో శుక్రవారం ఆయన స్టేషన్‌ పరిధిలోని వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ రత్నరాజు మాట్లాడుతూ ఆ రోజున విజయోత్సవ ర్యాలీలు, ఊరేగింపులకు అనుమతులు రద్దు చేశామన్నారు. బాణసంచా విక్రయాలతో పాటు కాల్చడంపై కూడా నిషేధం విధించామన్నారు. టపాసులు విక్రయించినా, కాల్చినా, శాంతిభద్రతలకు విఘాతం కలిగించినా బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎన్నికల ఫలితాలు ఎలా ఉన్నా ఎటువంటి దుందుడుకు చర్యలకు పాల్పడకుండా ప్రజాస్వామ్య స్ఫూర్తిని పరిరక్షించాలని, శాంతి భద్రతల పరిరక్షణకు రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని కోరారు. రాజకీయ ప్రత్యర్థులపై కవ్వింపు చర్యలకు పాల్పడటం తగదని హెచ్చరించారు. పార్టీ కార్యకర్తలను, మద్దతుదారులను రెచ్చగొట్టేలా వ్యవహరించొద్దని హితవు పలికారు. ఎన్నికల నిబంధనలను కచ్చితంగా పాటిస్తూ పోలీసు శాఖకు సహకరించాలని కోరారు. సమావేశంలో కార్పొరేటర్లు తంగిరాల రామిరెడ్డి, పుప్పాల కుమారి, తాటిపర్తి కొండారెడ్డి, వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

భవిత సెంటర్‌లో 22 మందికి అడ్మిషన్‌

కంచికచర్ల : స్థానిక హనుమాన్‌పేట, మోడల్‌కాలనీ, ప్రణీత కాలనీల్లోని దివ్యాంగులు, ప్రత్యేక అవసరాలు గల చిన్నారులను గుర్తించేందుకు శుక్రవారం సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఐఈఆర్టీ ఎం.కనకారావు ఇంటింటికీ వెళ్లి ప్రత్యేకావసరాలుగల చిన్నారుల వివరాలను సేకరించారు. దివ్యాంగులు, ప్రత్యేక అవసరాలు కలిగిన చిన్నారులను భవిత సెంటర్‌లో చేర్పించాలని వారి తల్లిదండ్రులకు సూచించారు. సర్వేలో భాగంగా గుర్తించిన 22 మందికి భవితసెంటర్‌లో చేర్పించినట్లు వివరించారు. భవిత సెంటర్‌లో విద్యనభ్యసించే వారికి పోషక విలువలతో కూడిన నాణ్యమైన ఆహారాన్ని అందజేస్తున్నట్లు వివరించారు.

కొండెక్కిన చికెన్‌ ధరలు

ఆగిరిపల్లి: మండలంలో చికెన్‌ ధరలు ఒక్కసారిగా పెరిగిపోయాయి. నిన్న మొన్నటి వరకు రూ.200 పలికిన చికెన్‌ ధర ఒక్కసారిగా రూ. 300లకు చేరుకోవడంతో సామాన్యులు హడలెత్తిపోతున్నారు. కోళ్ల దాణా ధరలు పెరగడంతో పాటు, వేసవి తీవ్రత నేపథ్యంలో కోళ్ల ఉత్పత్తి తగ్గిపోవడంతో డిమాండ్‌ అధికమైందని, దీని వల్ల చికెన్‌ ధరలు భారీగా పెరిగాయని పౌల్ట్రీ వ్యాపారులు పేర్కొంటున్నారు. ప్రస్తుతం దాణా కేజీ రూ.70గా ఉంది. పెరిగే చికెన్‌ ధరతో తమకు నష్టమే జరిగిందని, విక్రయాలు బాగా తగ్గాయని దుకాణదారులు వాపోతున్నారు. ముక్క లేనిదే ముద్ద దిగని కొందరు మాంసాహార ప్రియులు మాత్రం కేజీ చికెన్‌ బదులు అర కేజీతో సరిపెట్టుకుంటున్నారు.

మటన్‌ రూ.900 పైమాటే...

మాంసాహార ప్రియులకు మటన్‌ ధరలు కూడా మంట పుట్టిస్తున్నాయి కొద్ది రోజుల కిందటి వరకు రూ. 800 వరకు ఉన్న మటన్‌ ధర ఇప్పుడు రూ. 900లకు పైగా చేరుకోవడంతో కొనుగోలుదారులకు కళ్లు బైర్లు కమ్ముతున్నాయి. ఈ ధర జిల్లాలో ఎక్కడా లేదని పలువురు ప్రజలు చర్చించుకుంటున్నారు. దుకాణదారులంతా సిండికేట్‌గా ఏర్పడి ప్రజల దగ్గర దోచుకుంటున్నారని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఏది ఏమైనా పెరిగిన చికెన్‌, మటన్‌ ధరలు త్వరలోనే తగ్గుముఖం పట్టాలని మాంసాహార ప్రియులు కోరుకుంటున్నారు.

ఉపాధి పనుల పరిశీలన



కూలీల మస్తర్‌ను పరిశీలిస్తున్న ఎంపీడీఓ కుమారి

చాట్రాయి: ఉపాధి హామీ పథకం పనులు వేగవంతంగా నిర్వహించాలని ఎంపీడీఓ మంగాకుమారి అన్నారు. శుక్రవారం మండలంలోని ఆరుగొలనుపేటలో నిర్వహిస్తున్న ఉపాధి పనులను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కొలతల ప్రకారం వేతనాలు చెల్లించాలని, కూలీలు ఎక్కువగా పనుల్లో పాల్గొనే విధంగా సిబ్బంది తగిన చర్యలు తీసుకోవాలని ఆమె సూచించారు. అనంతరం మస్తర్‌ను పరిశీలించి వేతనాలు ఎంత వస్తున్నాయని కూలీలను అడిగి తెలుసుకున్నారు.

వ్యక్తిగత పరిశుభ్రత అవసరం



కాట్రేనిపాడులో అవగాహన కల్పిస్తున్న ఏసీడీపీఓ నాగేశ్వరి

ముసునూరు: కిశోర బాలికలకు రుతుక్రమ విజ్ఞానంపై సంపూర్ణ అవగాహన ఉండాలని నూజివీడు ఐసీడీఎస్‌ ప్రాజెక్టు ఏసీడీపీఓ నాగేశ్వరి అన్నారు. కాట్రేనిపాడు అంగన్‌వాడీ కేంద్రం వద్ద ఐసీడీఎస్‌ విభాగం ఆధ్వర్యంలో కిశోర బాలికలకు రుతుక్రమ విజ్ఞానం, వ్యక్తిగత పరిశుభ్రత, బాల్య వివాహాల నిరోధంపై శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏసీడీపీఓ మాట్లాడుతూ నేటి సమాజాన్ని అర్థం చేసుకుని, తగిన జాగ్రత్తలతో కిశోర బాలికలు నడుచుకోవాలన్నారు. రుతుక్రమ సమయాల్లో జాగ్రత్తలు, వ్యక్తిగత పరిశుభ్రత, స్వీకరించాల్సిన పోషకాహారం తదితర విషయాలను వివరించారు. బాలికల నడతపై వారి తల్లులు దృష్టి పెట్టి తగిన జాగ్రత్తలు వహించాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్‌ రాజ్యలక్ష్మి, మహిళా కానిస్టేబుల్‌ లక్ష్మీప్రసన్న పాల్గొన్నారు.

నూతన క్రిమినల్‌ చట్టాలపై అవగాహన



సుంకర రాజేంద్రప్రసాద్‌ను సత్కరిస్తున్న న్యాయవాదులు

నూజివీడు: పట్టణంలోని బార్‌ అసోసియేషన్‌ హాల్లో శుక్రవారం ఇండియన్‌ లాయర్స్‌ యూనియన్‌ ఆధ్వర్యంలో నూతన క్రిమినల్‌ చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఇండియన్‌ లాయర్స్‌ యూనియన్‌ నూజివీడు అధ్యక్షుడు గోళ్ల ప్రసాదరావు అధ్యక్షతన నిర్వహించిన సదస్సులో ముఖ్య అతిథిగా ఐలు జాతీయ అధ్యక్షుడు, ఏపీ బార్‌ కౌన్సిల్‌ సభ్యుడు సుంకర రాజేంద్రప్రసాద్‌ ముఖ్య అతిథిగా పాల్గొని నూతన చట్టాలను వివరించారు. జూలై 1 నుంచి నూతన చట్టాలు అమలులోకి వస్తాయని, న్యాయవాదులు, ప్రజలు నూతన చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఐలు తరపున నూతన చట్టాల గురించి తెలిపే పుస్తకాలను అందుబాటులోకి తెస్తామని చెప్పారు. అనంతరం సుంకర రాజేంద్రప్రసాద్‌ను సత్కరించారు. కార్యక్రమంలో న్యాయవాదులు మడుపల్లి మధురవిశంకర్‌, బోగోలు చంద్రశేఖర్‌రావు, నండూరి పద్మాంజలి, మడుపల్లి బసవారావు, గోవాడ నీలాంబరం, బసవరాజు రామకృష్ణ పాల్గొన్నారు.

నాణ్యమైన సిమెంట్‌తో పటిష్ట నిర్మాణాలు



తాపీ పనివారికి ఇన్సూరెన్స్‌ బాండ్లు అందజేస్తున్న కల్యాణ చక్రవర్తి, భవానీశంకర్‌

తోటమూల(గంపలగూడెం): భవన నిర్మాణాలను చేపట్టేవారు నాణ్యమైన సిమెంట్‌ను ఎంపిక చేసుకోవడం ద్వారా పటిష్ట కట్టడాలను నిర్మించవచ్చని భారతి సిమెంట్‌ మార్కెటింగ్‌ అసిస్టెంట్‌ మేనేజర్‌ కల్యాణ చక్రవర్తి అన్నారు. గంపలగూడెం మండలం తోటమూల మణికంఠ స్టీల్‌ సిమెంట్‌ అండ్‌ హార్డ్‌వేర్‌ సహకారంతో శుక్రవారం రాత్రి భారతి సిమెంట్‌ ఆధ్వర్యంలో తాపీ మేస్త్రీలు, భవన నిర్మాణ కార్మికులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతి సిమెంట్‌ తయారీలో నాణ్యమైన ముడి సరుకును వినియోగించడంతో పాటు, అత్యాధునిక టెక్నాలజీని వినియోగిస్తున్నారని చెప్పారు. భారతి సిమెంట్‌తో చేపట్టిన భవన నిర్మాణాల శ్లాబులను కంపెనీ టెక్నీషియన్లు వచ్చి పరిశీలిస్తారని తెలిపారు. కంపెనీ తరపున మేస్త్రీ, కార్మికులకు లక్ష ఇన్సూరెన్స్‌ బాండ్లను, ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. సీనియర్‌ టెక్నికల్‌ అధికారి భవానీ శంకర్‌, డీలర్‌ చిన్నంశెట్టి కృష్ణ, రాజేందర్‌, రవికిరణ్‌ పాల్గొన్నారు.

ముసునూరులో కార్డన్‌సెర్చ్‌



ముసునూరులో కార్డన్‌సెర్చ్‌ నిర్వహిస్తున్న పోలీసులు

ముసునూరు: ఎన్నికల ఫలితాలపై ఘర్షణ వాతావరణం లేకుండా ఉండాలనే ఉద్దేశంతో గ్రామాల్లో కార్డన్‌సెర్చ్‌ నిర్వహిస్తున్నామని ఎస్‌ఐ పి.వాసు తెలిపారు. శుక్రవారం రాత్రి ముసునూరులోని ఎస్సీ, బీసీ ఏరియాల్లో కార్డన్‌సెర్చ్‌ నిర్వహించారు. ఉన్నతాధికారుల ఆదేశాలతో అన్ని గ్రామాల్లో శాంతిభద్రతల పరిరక్షణకు అన్ని చర్యలు చేపట్టామన్నారు. అక్రమ మద్యం, సారా, బెల్ట్‌షాపులు, పేలుడు సామగ్రి, ఇసుక అక్రమ రవాణా తదితర అంశాలపై దృష్టి పెట్టి కార్డన్‌ సెర్చ్‌ నిర్వహిస్తున్నామని వివరించారు.

ప్రయాణం.. ఆహ్లాదకరం



మండుతున్న ఎండలతో ప్రయాణం విసుగుగా మారుతోంది. విజయవాడ నుంచి ఇబ్రహీంపట్నం వైపు వెళ్లేవారు ఎండ వేడిమితో అల్లాడుతున్నారు. కానీ గొల్లపూడి వద్దకు రాగానే ప్రయాణికులు ఒకింత సేదతీరుతున్నారు. ఇక్కడ రహదారికి ఇరువైపులా ఏపుగా పెరిగిన పచ్చని చెట్లు.. గొడుగులా అల్లుకున్న వాటి కొమ్మలు పచ్చందాలతో వాహన చోదకులకు కనువిందు చేస్తున్నాయి. చెట్ల నుంచి వచ్చే స్వచ్ఛమైన చల్లని గాలి, చెట్ల కొమ్మల నీడ వారి ప్రయాణాన్ని ఆహ్లాదకరంగా మారుస్తోంది. వాహన చోదకులు కొందరు ఇక్కడకు రాగానే కొద్దిసేపు ఆగి సేద తీరుతుండగా.. మరికొందరు హమ్మయ్యా అంటూ ఊపిరి పీల్చుకుని ముందుకు సాగుతున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్‌, విజయవాడ

టెన్త్‌ సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభం

ముసునూరు: మండలంలో 45 మంది పదో తరగతి విద్యార్థులు తొలి రోజు తెలుగు సప్లిమెంటరీ పరీక్షకు హాజరైనట్లు ఎంఈఓ బీవీఎస్‌ సుబ్బారావు తెలిపారు. మండలంలోని ముసునూరు పరీక్షా కేంద్రంలో శుక్రవారం తెలుగు పరీక్ష నిర్వహించారు. ముసునూరు పరీక్షా కేంద్రంలో 104 మంది పరీక్ష రాయాల్సి ఉండగా 45 మంది విద్యార్థులు హాజరయ్యారని, 59 మంది పరీక్షకు గైర్హాజరయ్యారని ఎంఈఓ చెప్పారు.

27న ఆలయ భూముల కౌలు వేలం

మక్కపేట(వత్సవాయి) : గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీకోదండ రామాలయం, రామలింగేశ్వర, రాజగోపాల, కాశీవిశ్వేశ్వర, అత్తిలి సారంగమఠానికి చెందిన వ్యవసాయ భూములకు ఈనెల 27 న బహిరంగ కౌలు వేలం నిర్వహిస్తామని ఈఓ సీహెచ్‌ హరిదుర్గా నాగేశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తం 78.47 ఎకరాల భూమి కౌలుకు ఇస్తున్నట్లు వివరించారు. గ్రామంలోని రామాలయం ఆవరణలో నిర్వహించే కౌలువేలంలో పాల్గొనేవారు ముందుగా రూ. పది వేలు డిపాజిట్‌ చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఆసక్తిగల వ్యక్తులు కౌలువేలంలో పాల్గొనాలని ఈఓ కోరారు.

జుజ్జూరులో పోలీసు కవాతు

జుజ్జూరు(వీరులపాడు): శాంతిభద్రతలు, ప్రజాజీవనానికి విఘాతం కలిగిస్తూ అవాంఛనీయ సంఘటనలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని వీరులపాడు ఎస్‌ఐ మహాలక్ష్ముడు హెచ్చరించారు. జుజ్జూరులో శుక్రవారం సాయంత్రం పోలీసులు ప్రత్యేక కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌ అనంతరం రాష్ట్రంలో పలుచోట్లు అల్లర్లు జరిగిన నేపథ్యంలో మండలంలో శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా గ్రామాల్లో పోలీసు కవాతు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఘర్షణలకు పాల్పడే వారిపై, ప్రజలను భయాభ్రాంతులకు గురిచేసేందుకు యత్నించే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జూన్‌ 4 న ఓట్ల లెక్కింపు సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా సమస్యాత్మక గ్రామాల్లో ఇప్పటికే పోలీసు పికెట్‌ను నిర్వహిస్తున్నామన్నారు. పాత నేరస్తులు, రౌడీషీటర్లు, ఘర్షణలకు పాల్పడే వారిని ముందుగానే గుర్తించి బైండోవర్‌ చేశామని వివరించారు.